సాక్షి
కుమురం భీం

శుక్రవారం । 4 । అక్టోబర్ । 2024

గరిష్టం/కనిష్టం
35.3 /25.4

వాతావరణం
ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరుగుతాయి. వేడిగా ఉంటుంది. అక్కడక్కడ వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

ధ్రువపత్రాల పరిశీలన పారదర్శకంగా నిర్వహించాలి



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్ దోత్రే

ఆసిఫాబాద్‌రూరల్: డీఎస్సీ- 2024లో భాగంగా చేపట్టిన ధ్రువపత్రాల పరిశీలన పారదర్శకంగా నిర్వహించాలని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే అన్నారు. జిల్లా కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలల్లో నిర్వహిస్తున్న ధ్రువపత్రాల పరిశీలన ప్రక్రియను గురువారం పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 341 పోస్టుల భర్తీకి 1:3 పద్ధతిలో అభ్యర్థుల ధ్రువపత్రాలు పరిశీలిస్తున్నామని తెలిపారు. గురువారం నాటికి 314 మంది ధ్రువపత్రాలు పరిశీలించామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో పరీక్షల నిర్వహణ అధికారి ఉదయ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

'ఫ్యామిలీ' సర్వే ప్రారంభం



ధనోరాలో వివరాలు తెలుసుకుంటున్న అదనపు కలెక్టర్ దీపక్ తివారి

ఆసిఫాబాద్/కెరమెరి: పైలెట్ ప్రాజెక్టు కింద జిల్లాలో చేపట్టిన ఫ్యామిలీ డిజిటల్ సర్వే గురువారం ప్రారంభమైంది. ఆసిఫాబాద్ మున్సిపాలిటీలో మూడో వార్డు, కాగజ్‌నగర్ మున్సిపాలిటీలోని 14వ వార్డు, కెరమెరి మండలం ధనోరా, సిర్పూర్(టి) మండలం వెంకట్రావ్‌పేట్ గ్రామంలో అధికారులు, సిబ్బంది గడపగడపకూ వెళ్లి వివరాలు సేకరించారు. కెరమెరి మండలం ధనోరా గ్రామంలో చేపట్టిన సర్వేను అదనపు కలెక్టర్ దీపక్ తివారి పరిశీలించారు. సర్వే పకడ్బందీగా చేపట్టాలని సూచించారు. గ్రామంలోని 175 కుటుంబాల వివరాలు సేకరించాలన్నారు. ఆయా కార్యక్రమాల్లో ఆర్డీవో లోకేశ్వర్‌రావు, ఎంపీడీవోలు శ్రీనివాస్, అంజద్‌పాషా, తహసీల్దార్ దత్తు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం సేకరణకు ఏర్పాట్లు చేయాలి

ఆసిఫాబాద్: ఖరీఫ్ సీజన్ వరిధాన్యం సేకరణకు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి అన్నారు. గురువారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర నీటిపారుదల శాఖ, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, డీజీపీ జితేందర్, పౌరసరఫరాల శాఖ కమిషనర్ డీఎస్ చౌహాన్‌తో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్లు, ఎస్పీలు, సబ్ కలెక్టర్లు, ఆర్డీవోలు, వ్యవసాయ, పౌరసరఫరాల శాఖ, సహకార, మార్కెటింగ్, గ్రామీణాభివృద్ధి, రవాణాశాఖ అధికారులతో ధాన్యం కొనుగోళ్లు, డీఎస్సీ- 2024 అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన అంశాలపై సమీక్షించారు. సీఎం మాట్లాడుతూ రాష్ట్రస్థాయిలో కంట్రోల్ రూం ఏర్పాటు చేస్తామని, సందేహాలుంటే నివృత్తి చేసుకోవాలని సూచించారు. పోలీసు శాఖ అంతర్రాష్ట్ర జిల్లా చెక్ పోస్టులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. డీఎస్సీ 2024లో అభ్యర్థులకు ఈ నెల 9న నియామకపు ఉత్తర్వులు జారీ చేసేలా ధ్రువపత్రాల పరిశీలన వేగవంతం చేయాలని ఆదేశించారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ నుంచి కలెక్టర్ వెంకటేశ్ దోత్రే, ఎస్పీ డీవీ శ్రీనివాసరావు, అదనపు కలెక్టర్లు దీపక్ తివారి, దాసరి వేణు, కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లాతో వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరయ్యారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 34 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. సరిహద్దుల వద్ద తనిఖీ కేంద్రాలు ఏర్పాటు చేసేందుకు పటిష్టమైన చర్యలు తీసుకుంటామని వివరించారు. డీఎస్సీ మెరిట్ జాబితా అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన కొనసాగుతుందని తెలిపారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలని వినతి

ఆసిఫాబాద్‌రూరల్: ఏఎన్‌ఎంలకు ఎనిమిది నెలలుగా పెండింగ్‌లో ఉన్న వేతనాలు చెల్లించాలని ఏఎన్‌ఎం యూనియన్(సీఐటీయూ) ఆధ్వర్యంలో గురువారం జిల్లా కేంద్రంలో కలెక్టర్ వెంకటేశ్ దోత్రేకు వినతిపత్రం అందించారు. యూనియన్ జిల్లా అధ్యక్షుడు రాజేందర్ మాట్లాడుతూ ఆశ్రమ పాఠశాలల్లో ఏఎన్‌ఎంలకు వేతనాలు అందక కుటుంబ పోషణకు ఇబ్బంది పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. డీటీడీవో రమాదేవికి సైతం వినతిపత్రం అందించారు. ఏఎన్‌ఎంలు మహేశ్వరి, సుజాత, శ్రీదేవి, ప్రమీల తదితరులు పాల్గొన్నారు.



కాగజ్‌నగర్ మున్సిపాలిటీకి చెందిన షాపింగ్ కాంప్లెక్స్ స్థలం

పట్టు సడలుతోంది!

- ప్రభుత్వ భూమిపై ప్రైవేటు వ్యక్తుల పెత్తనం
- ఇంటి నంబరు తీసుకుని మరీ రిజిస్ట్రేషన్
- చోద్యం చూస్తున్న కాగజ్‌నగర్ మున్సిపాలిటీ అధికారులు
- కోర్టులో సరైన ఆధారాలు సమర్పిస్తేనే వివాదం పరిష్కారం
- ఆ దిశగా అడుగులు వేయని బల్దియా యంత్రాంగం

సాక్షి, ఆసిఫాబాద్: కాగజ్‌నగర్ మున్సిపాలిటీకి చెందిన 497 చదరపు గజాల స్థలం రక్షించడంలో అధికారులు విఫలమవుతున్నారు. ప్రభుత్వ స్థలాలు ఆక్రమణకు గురికాకుండా రక్షించాల్సిన అధికారులే కబ్జాదారులకు అండగా నిలవడంతో పెట్రేగిపోతున్నారు. మున్సిపాలిటీ పాలకవర్గం, అధికార యంత్రాంగం అండతో ఏకంగా రూ.4 కోట్ల విలువైన కాగజ్‌నగర్ మున్సిపల్ కాంప్లెక్స్ స్థలానికే ఎసరు పెట్టడం విశేషం. తనది కాని భూమిని తనదే అంటూ ఓ ప్రైవేటు వ్యక్తి కోర్టును ఆశ్రయిస్తే.. ప్రభుత్వ భూమిగా నిర్ధారించేందుకు అధికారులు కోర్టుకు సరైన ఆధారాలు సమర్పించే దిశగా ప్రయత్నించకపోవడంపై అనేక అవినీతి ఆరోపణలు వినిపిస్తున్నాయి. రూ.లక్షల్లో చేతులు మారడంతోనే ఉన్నతాధికారులు మౌనంగా ఉన్నారనే విమర్శలు ఉన్నాయి.

రూ.2 కోట్లకు బేరం

ప్రభుత్వ స్థలాన్ని కోర్టు ద్వారా ఎలాగైనా దక్కించుకోవాలని యత్నిస్తున్న కొందరు ప్రైవేటు వ్యక్తులు పట్టణానికి చెందిన ఓ బడా వ్యాపారితో స్థలం కొనుగోళ్లకు సంబంధించి రూ.2 కోట్లకు బేరం కుదుర్చుకున్నట్లు సమాచారం. ఆ వ్యాపారి ఇప్పటికే మున్సిపాలిటీ పాలకవర్గ సభ్యులకు, స్థలం దక్కించుకోవడంలో కీలకభూమి పోషిస్తున్న వ్యక్తికి రూ.40 లక్షల వరకు మామూళ్లు ఇచ్చినట్లు తెలుస్తోంది.

పట్టించుకోని అధికారులు..

కాగజ్‌నగర్ పట్టణంలో సర్వే నంబరు 147/2లో మున్సిపాలిటీకి చెందిన 2.58 ఎకరాల భూమి ఉంది. అందులో 497 చదరపు గజాల స్థలంలో మున్సిపల్ అధికారులు షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం చేపట్టాలని నిర్ణయించి పనులు మొదలెట్టారు. ప్రస్తుతం మార్కెట్ ధర ప్రకారం ఆ స్థలం విలువ రూ.4 కోట్ల వరకు ఉంది. సర్వే నం.146 పట్టాదారు రాపెల్లి శ్రీనివాస్ 147/2లో ఈ స్థలం తనదే అంటూ 2016లో సిర్పూరు కోర్టును ఆశ్రయించారు. కోర్టు ఆదేశాల ప్రకారం మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్ పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. తర్వాత రాపెల్లి శ్రీనివాస్ మరణించగా.. అతని భార్య రాపెల్లి భాగ్యలక్ష్మి కోర్టు వ్యవహారాలు చూసుకుంటోంది. అప్పటి నుంచి ఈ వివాదం కోర్టు పరిధిలోనే ఉండగా.. మున్సిపల్ అధికారులకు తమ స్థలాన్ని దక్కించుకోవాలనే చిత్తశుద్ధి లేకపోవడం విడ్డూరంగా ఉంది. ప్రస్తుతం పాలకవర్గంలోకి కొందరు సభ్యులు రాపెల్లి భాగ్యలక్ష్మితో చేతులు కలిపి మున్సిపాలిటీ స్థలాన్ని దక్కించుకునేందుకు ప్రణాళికలు రచించారు. ఆ స్థలానికి ఇంటి నంబరు కేటాయించేలా చక్రం తిప్పారు. మున్సిపాలిటీకి చెందిన ఓ ఉన్నతాధికారి ఇంటి నంబరు కేటాయింపులో సంపూర్ణ సహకారాలు అందించినట్లు తెలుస్తోంది. ఇందుకు ఆ అధికారికి ఏకంగా రూ.10 లక్షలు ముడుపులు చెల్లించారని మున్సిపాలిటీ వర్గాలే ఆరోపిస్తున్నాయి. స్థలం విషయంలో ఎలాంటి జోక్యం చేసుకుండా ఉండి.. ఆ స్థలం రాపెల్లి భాగ్యలక్ష్మి పరమైతే అంతే మరింత భారీగా సొమ్ము అప్పగించేలా ఇరువర్గాల మధ్య ఒప్పందం జరిగినట్లు సమాచారం.

రిజిస్ట్రేషన్ రద్దుకు యత్నించని అధికారులు

సర్వే నంబరు 146 పేరిట కాగజ్‌నగర్ మున్సిపాలిటీకి చెందిన సర్వే నంబరు 147/2లో 497 చదరపు గజాల స్థలానికి ఇంటి నంబరు తీసుకున్న రాపెల్లి భాగ్యలక్ష్మి ఆ స్థలాన్ని తన కుమారుడు వెంకట సాయిబాబుకు(రిజిస్ట్రేషన్ నం. 1103/2024) గిఫ్ట్ ద్వారా రిజిస్ట్రేషన్ చేశారు. దీనిపై 'సాక్షి' వరుస కథనాలు రావడంతో స్పందించిన కాగజ్‌నగర్ మున్సిపల్ కమిషనర్ అంజయ్య.. 'అక్రమ పద్ధతిలో చేసుకున్న రిజిస్ట్రేషన్‌ను రద్దు చేస్తామని, ఇంటి నంబరు ఆన్‌లైన్‌లో తొలగించాం' అని పేర్కొన్నారు. అందులో భాగంగా ఆసిఫాబాద్ సబ్‌రిజిస్ట్రార్‌కు ఆ రిజిస్ట్రేషన్‌ను రద్దు చేయమని లేఖ రాసి మున్సిపల్ కమిషనర్ అంజయ్య చేతులు దులుపుకొన్నారన్న విమర్శలున్నాయి. ఒక రిజిస్ట్రేషన్ రద్దు కావాలంటే నిబంధనల మేరకు ఇరువర్గాలు సబ్‌రిజిస్ట్రార్ వద్ద హాజరై అంగీకారం తెలపాల్సి ఉంది. కానీ కాగజ్‌నగర్ మున్సిపాలిటీ స్థలం విషయంలో ఇదేమీ జరగకపోవడం వెనుక భారీ మొత్తం డబ్బు చేతులు మారడమే కారణమన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. రాపెల్లి వెంకట సాయిబాబు తన పేరిట ఉన్న స్థలాన్ని మరొకరి పేరిట విక్రయించి రిజిస్ట్రేషన్ చేయిస్తే ఆ స్థలం ఎప్పటికీ మున్సిపాలిటీ దక్కదని రిజిస్ట్రేషన్ శాఖ నిబంధనలు చెబుతున్నాయి. మున్సిపల్ అధికారులు మాత్రం పట్టించుకోకపోవడం విస్మయాన్ని కలిగిస్తోంది. ముడుపులు తీసుకున్నారన్న వాదనలకు బలాన్ని చేకూరుస్తోంది. అందువల్లే కోర్టులోనూ సరైన వాదనలు వినిపించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నట్లు సమాచారం. జిల్లా ఉన్నతాధికారులు ఈ విషయంలో జోక్యం చేసుకొని రూ.కోట్ల విలువైన ప్రభుత్వ భూములను రక్షించాలని ప్రజలు కోరుతున్నారు.

గాంధీచౌక్‌లో అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు



దుర్గమ్మా.. కరుణించు

- జిల్లావ్యాప్తంగా ప్రారంభమైన శరన్నవరాత్రులు

ఆసిఫాబాద్: జిల్లావ్యాప్తంగా గురువారం నుంచి శరన్నవరాత్రులు ప్రారంభమయ్యాయి. ఆలయాలు, కాలనీల్లో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మండపాల్లో భక్తులు దుర్గమ్మ, శారదా మాత విగ్రహాలు ప్రతిష్ఠించారు. విద్యుత్ వెలుగులతో మండపాలను శోభాయమానంగా అలంకరించారు. తొలిరోజు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. నవరాత్రుల్లో భాగంగా నిత్యం పూజలతోపాటు సాంస్కృతిక, భజనా కార్యక్రమాలు నిర్వహించనున్నారు.



బాపూనగర్‌లోని శారదా దుర్గామండలి..



వాసవీ మందిరంలో కొలువుదీరిన అమ్మవారు



పైకాజీనగర్‌లో పూజలు చేస్తున్న భక్తులు

బాలాత్రిపురసుందరిగా అమ్మవారు



అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు



గుహలో ఉన్న మహంకాళి అమ్మవారికి హారతి ఇస్తున్న మహిళలు

రెబ్బెన(ఆసిఫాబాద్): రెబ్బెన మండలం ఇందిరానగర్‌లోని కనక దుర్గాదేవి, స్వయంభూ మహంకాళి ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలు అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. మొదటిరోజు గురువారం అమ్మవారు బాలాత్రిపురసుందరి దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. పూసల మహేశ్‌శాస్త్రి, ఆలయ ప్రధాన అర్చకుడు దేవార వినోద్ అమ్మవారికి ప్రాణప్రతిష్ఠ పూజలు నిర్వహించారు. పలువురు భక్తులు అమ్మవారి దీక్షలు స్వీకరించారు. ఆలయంలోని అమ్మవారితోపాటు గుహలో ఉన్న మహంకాళి అమ్మవారిని భక్తులు దర్శించుకుని పూజలు చేశారు. ఒడిబియ్యం, నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం అన్నదానం ఏర్పాటు చేశారు.

ఆర్థిక మోసాలపై అప్రమత్తత అవసరం

- కలెక్టర్ వెంకటేశ్ దోత్రే

ఆసిఫాబాద్‌అర్బన్: ఆర్థిక మోసాలపై ప్రజలకు అప్రమత్తత అవసరమని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో గురువారం అదనపు కలెక్టర్ దాసరి వేణు, రిజర్వ్ బ్యాంకు ఆఫ్ ఇండియా(హైదరాబాద్) ఏజీఎం రాధిక భరత్‌తో కలిసి వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులకు ఆర్థిక మోసాలు, నగదు రహిత లావాదేవీలు, ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కల్పించారు. కలెక్టర్ మాట్లాడుతూ అపరిచితుల నుంచి వచ్చే ఫోన్‌కాల్స్‌కు ప్రజలు ఎట్టి పరిస్థితుల్లోనూ స్పందించొద్దన్నారు. వ్యక్తిగత బ్యాంకు ఖాతా వివరాలు, ఏటీఎం కార్డు నంబర్లు ఎవ్వరికీ చెప్పొద్దన్నారు. సాంకేతికత ఆధారంగానే మోసాలు జరుగుతున్నాయని స్పష్టం చేశారు. ఆన్‌లైన్ పేమెంట్ల విషయంలో జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఆన్‌లైన్ మోసానికి గురైతే టోల్‌ఫ్రీ నంబర్ 1930కి సమాచారం అందించాలన్నారు. ఆర్థిక అక్షరాస్యతపై గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని ఆదేశించారు. అనంతరం ఆర్థిక అక్షరాస్యత పోస్టర్‌ను అధికారులతో కలిసి ఆవిష్కరించారు. సమావేశంలో లీడ్ బ్యాంకు డిస్ట్రిక్ మేనేజర్ రాజేశ్వర్ జోషి, జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్, అధికారులు

'ఎల్‌ఆర్‌ఎస్' పరిశీలన వేగవంతం చేయాలి



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్ దోత్రే

ఆసిఫాబాద్‌అర్బన్: అనుమతి లేని లేఅవుట్ల క్రమబద్ధీకరణ(ఎల్‌ఆర్‌ఎస్) దరఖాస్తుల పరిశీలన ప్రక్రియ వేగవంతం చేయాలని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో గురువారం అదనపు కలెక్టర్ దీపక్ తివారి, ఆర్డీవో లోకేశ్వర్‌రావుతో కలిసి సర్వే బృందాల ప్రతినిధులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులను రికార్డులతో సరిచూసి క్షేత్రస్థాయిలో పరిశీలించాలన్నారు. చెరువు శిఖం, వాగులు, ప్రభుత్వ భూములు, రైల్వే స్టేషన్ సమీపంలో ఉన్న ప్లాట్ల రికార్డులు సేకరించాలన్నారు. కోర్టు కేసులు ఉన్న ప్లాట్ల వివరాలు స్పష్టంగా నమోదు చేయాలని ఆదేశించారు. సర్వే బృందాలు దరఖాస్తుదారుడికి సమాచారం అందించి క్షేత్రస్థాయి పర్యటనకు వెళ్లాలని సూచించారు. దరఖాస్తుదారుడి వద్ద ఉన్న ధ్రువీకరణ పత్రాలు పరిశీలించాలన్నారు. సమావేశంలో పట్టణ ప్రణాళిక అధికారి యశ్వంత్, నీటిపారుదల, మున్సిపల్ శాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ధరల మంట..!

- పండుగ పూట అమాంతం పెరిగిన వంటనూనెల రేట్లు
- అదే దారిలో కూరగాయలు, నిత్యావసరాలు
- పేద, మధ్య తరగతి కుటుంబాలపై అదనపు భారం



ఆసిఫాబాద్: పండుగపూట జిల్లాలో నిత్యావసరాల ధరలు భగ్గుమంటున్నాయి. వంట నూనెలతోపాటు బియ్యం, పప్పులు, కొబ్బరి, డ్రైఫ్రూట్స్, మసాలా దినుసులు, కూరగాయల రేట్లు వినియోగదారులకు చుక్కలు చూపిస్తున్నాయి. అన్నిరకాల వంట నూనెల ధరలు ఒకేసారి 15 నుంచి 20 శాతం పెరగడం ఆందోళన కలిగిస్తోంది. వంట నూనెలు లీటర్‌కు రూ.30 వరకు పెంచగా, బియ్యం క్వింటాల్‌కు రూ.300 వరకు పెరిగింది. అదేదారిలో కూరగాయల ధరలు ఆకాశన్నంటుతున్నాయి. శరన్నవరాత్రులు, దసరా పండగ సమయంలో ఈ పెరుగుదల సామాన్య, మధ్య తరగతి ప్రజలకు భారంగా మారింది.

వంట నూనెలు సలసల

వంట నూనెలపై కేంద్ర ప్రభుత్వం దిగుమతి సుంకం 12.5 నుంచి 32.5 శాతానికి పెంచుతున్నట్లు గత నెలలో ప్రకటించింది. ఈ క్రమంలో మార్కెట్‌లో అన్నిరకాల వంట నూనెల ధరలు అమాంతం పెరిగాయి. మొన్నటి వరకు మార్కెట్‌లో లీటర్ సన్‌ఫ్లవర్ ఆయిల్ రూ.110 ఉండగా, ప్రస్తుతం రూ.140కి చేరింది. పామాయిల్ లీటర్ రూ.90 ఉండగా రూ.115కి చేరింది. వేరుశనగ నూనె సైతం రూ.155 నుంచి రూ.160కి పెరిగింది. ఇక మధ్య తరగతి, వేతన జీవులు అధికంగా వినియోగించే జైశ్రీరాం సన్నబియ్యం క్వింటాల్ రూ.6 వేలు ఉండగా రూ.7 వేలకు చేరింది. అలాగే వెల్లుల్లి, ఉల్లిగడ్డల ధరలు సైతం భారీగా పెరిగాయి. ఇటీవల ఆంధ్రప్రదేశ్‌లో వరదల ప్రభావంతో కొబ్బరి దిగుబడి గణనీయంగా తగ్గడంతో కొబ్బరికాయల ధరలు పెరిగాయి. హోల్‌సేల్ మార్కెట్‌లో రూ.13 ఉన్న కొబ్బరికాయ రూ.20కి పెంచారు. కొబ్బరి కుడుకలు సైతం కిలో రూ.80 వరకు పెరగడంతో రూ.200కు చేరింది.

కూరగాయలు కొనేదెలా..?

సామాన్యులకు అందుబాటులో ఉండే కూరగాయల ధరలు సైతం పెరగడం ఆందోళన కలిగిస్తోంది. నెల క్రితంతో పోలిస్తే ధరలు అమాంతం రెట్టింపయ్యాయి. జిల్లా కేంద్రంలోని మార్కెట్‌లో గత నెలలో రూ.40 కిలో ఉన్న టమాట గురువారం కిలో రూ.70కి విక్రయించగా.. కిలో రూ.60 ఉన్న పచ్చిమిర్చి రూ.120కి పెంచి అమ్ముతున్నారు. ప్రజలు మార్కెట్‌కు వెళ్లాలంటే బెంబేలెత్తిపోతున్నారు. ఆరుగాలం కష్టపడి పండించిన రైతుకు గిట్టుబాటు ధర లభించక అప్పుల పాలవుతుంటే.. మరోవైపు వినియోగదారులు నిలువు దోపిడీకి గురవుతున్నారు. రైతు నుంచి వ్యాపారులు కొనుగోలు చేసే రేటుకు, బహిరంగ మార్కెట్లో విక్రయించే ధర కిలోకు ఏకంగా రూ.25 నుంచి రూ.35 వ్యత్యాసం కనిపిస్తోంది. స్థానికంగా కూరగాయల సాగు ఎక్కువగా లేకపోవడం కూడా ధరల పెరుగుదలకు కారణమవుతోంది. జిల్లాకు అధికంగా ఇతర రాష్ట్రాల నుంచే కూరగాయలు దిగుమతి అవుతుంటాయి. సాగు తగ్గడం, డిమాండ్‌కు సరిపడా దిగుబడి లేకపోవడంతో వ్యాపారులు అనుకూలంగా మార్చుకుని ధరలు పెంచుతున్నారు.

చేతులు మారే క్రమంలో..

రైతు నుంచి మార్కెట్‌కు వచ్చే క్రమంలో కూరగాయలు దళారుల చేతులు మారుతున్నాయి. ఈ క్రమంలో ఒక్కో వ్యాపారి తమ లాభాలు చూసుకుని వినియోగదారులకు అధిక ధరకు విక్రయిస్తున్నారు. బహిరంగ మార్కెట్‌తో పోలిస్తే రైతు బజార్లలో కొంతరేటు తక్కువగా ఉంటుంది. కానీ జిల్లాలో మాత్రం రైతుబజార్లు ఏర్పాటు చేయకపోవడం ప్రజల పాలిట శాపంగా.. దళారులకు వరంగా మారింది. జిల్లా కేంద్రంలోని కూరగాయల మార్కెట్‌లో 90 శాతం దళారులే రిటైల్ కూరగాయలు విక్రయిస్తున్నారు. మార్కెట్‌లో హోల్‌సేల్‌గా కొనుగోలు చేసిన చిరువ్యాపారులు ఇష్టానుసారంగా విక్రయిస్తున్నారు. కూరగాయల వ్యాపారంపై మార్కెటింగ్ శాఖ అధికారుల నియంత్రణ చర్యలు లేకపోవడం కూడా వారికి కలిసి వస్తోంది. పెరిగిన ధరలతో ఒక్కో కుటుంబంపై సగటున నెలకు రూ.2 వేల నుంచి రూ.3 వేల వరకు అదనపు భారం పడుతోంది.

జిల్లా కేంద్రంలోని మార్కెట్‌లో కూరగాయల ధరలు (రూ.లలో)

టమాట	70
పచ్చిమిర్చి	120
దొండకాయ	100
బీరకాయ	60
వంకాయ	40
క్యారెట్	100
క్యాలీఫ్లవర్	100
బెండకాయ	60
సోరకాయ	60
చిక్కుడు	80
అల్చింత	60
కాకరకాయ	80
దోసకాయ	60
గోబి	40
ఆలుగడ్డ	30
ఉల్లిగడ్డ	70
వెల్లుల్లి	200

ధరలు నియంత్రించాలి



రోజురోజుకూ పెరుగుతున్న ధరలు సామాన్య, మధ్య తరగతి ప్రజలకు భారంగా మారాయి. 15 రోజుల్లోనే వంటనూనెల ధరలు పెరిగిపోయాయి. మార్కెట్‌కు వెళ్లాలంటే ఇబ్బందిగా మారింది. ప్రభుత్వం నిత్యావసరాల ధరలు నియంత్రించాలి.

– వి.సుమిత్ర, గృహిణి, ఆసిఫాబాద్

పండుగపూట భారం



పండుగ పూట ధరల పెరుగుదల భారంగా మారింది. అధికంగా వినియోగించే వంట నూనె, ఉల్లిగడ్డ, వెల్లులితోపాటు కూరగాయల ధరలు పెరిగాయి. అధికారులు జిల్లా కేంద్రంలో రైతుబజార్ ఏర్పాటు చేయాలి.

– సంపూర్ణ, గృహిణి, ఆసిఫాబాద్

మాకు స్వేచ్ఛనీయండి

జన్నారం: దట్టమైన అడవుల్లో స్వేచ్ఛగా బతకాలనుకుంటాం.. మేము ఎవరికీ హాని చేయం..అడవితల్లి ఒడిలో అలరాడుతుంటే కొందరు స్వార్థపరులు మాకు ఉచ్చులు బిగుస్తున్నారు.. బరిసెలతో పొడిచి, కరెంటు పెట్టి, మందు ప్రయోగాలు వంటి దుశ్చర్యలకు పాల్పడు తూ మమ్మల్ని హత మారుస్తున్నారు. మా మాంసాన్ని అమ్ముకుంటూ సొమ్ము చేసుకుంటున్నారు. మా కోసం అనేక చట్టాలున్నా అవి వారికి చుట్టా లుగానే మారుతున్నాయట..మా బాధలను గుర్తించి రక్షణ కల్పించండి.. అక్టోబర్ 2 నుంచి 8 వరకు నిర్వహిస్తున్న వన్యప్రాణి వారోత్సవాల సందర్భంగా మిమ్మల్ని వేడుకుంటున్నాం.

– ఇట్లు..మీ వన్యప్రాణి



కుంటలో నీరు తాగుతున్న నీలుగాయిలు (ఫైల్)

- వన్యప్రాణుల సంరక్షణకు అనేక చట్టాలు
- కవ్వాల్..వన్యప్రాణుల కలయిక
- కొనసాగుతున్న వన్యప్రాణి వారోత్సవాలు

రక్షణ కవచంలా..

దట్టమైన అడవిగా కవ్వాల్ అభయారణ్యం విస్తరించింది. 1965లో వన్యప్రాణుల విభాగంగా(వైల్డ్‌లైఫ్)గా ఏర్పాటు చేశారు. 1972లో వన్యప్రాణుల సంరక్షణ చట్టం అమలైంది. 2012లో నేషనల్ టైగర్ అథారిటీ, కేంద్రప్రభుత్వం కవ్వాల్ అభయారణ్యాన్ని పులుల రక్షిత ప్రదేశం (టైగర్‌జోన్)గా ఏర్పాటు చేసింది. ఈ అభయారణ్యం 2,015 స్క్వేర్ కి.మీ వైశాల్యంతో ఉంది. 893 చదరపు కి.మీ. కోర్ ఏరియా, 1123 చదరపు కి.మీ. బఫర్ ఏరియాగా గు ర్తించింది. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా టైగర్‌జోన్ వ్యాపించి ఉంది. చుక్కల దుప్పి, నీలుగాయిలు, దుప్పులు, సాంబర్లు, కొండగొర్రెలు, జింకలు, కుందేళ్లు, ముళ్లపంది తదితర వాటితోపాటు పులులు, చిరుతలు, ఎలుగుబంట్లు వన్యమృగాలు స్వేచ్ఛగా జీవించేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఈ టైగర్‌జోన్ ఏర్పాటు నుంచి వన్యప్రాణులకు రక్షణ కవచంగా మారింది. కఠిన చట్టాల అమలుతో వన్యప్రాణుల వేట తగ్గుముఖం పట్టింది.



అడవిలో ఏర్పాటు చేసిన నీటికుంట



వన్యప్రాణుల కోసం ఏర్పాటు చేసిన గడ్డిక్షేత్రాలు

డివిజన్‌లో సౌకర్యాలు..

జన్నారం అటవీ డివిజన్‌లో వన్యప్రాణుల సంరక్షణకు అధికారులు సౌకర్యాలు కల్పిస్తున్నారు. 40 బీట్లలో గడ్డి క్షేత్రాలను విరివిగా ఏర్పాటు చేశారు. నీటి కుంటలు, అవాసానికి అనువుగా ఏర్పాట్లు చేస్తున్నారు. గత మూడేళ్లుగా అడవుల్లోకి పశువులు వెళ్లకుండా కట్టడి చేశారు. అలజడి లేకపోవడంతో వన్యప్రాణులు స్వేచ్ఛగా తిరిగే అవకాశం ఉంది. ఇందుకుతోడు ఆహారం కోసం వివిధ రకాల గడ్డి పెంచడం, నీటి కుంటల నిర్మాణం, అలజడి లేకుండా అవాసం ఉండేలా చర్యలు తీసుకుంటున్నారు. గతంతో పోలిస్తే వన్యప్రాణుల సంఖ్య రెట్టింపయినట్లు అధికారులు తెలిపారు.

వన్యప్రాణుల సంరక్షణకు చర్యలు



వన్యప్రాణుల సంరక్షణకు అన్ని చర్యలు తీసుకుంటున్నాం. అడవిలో గడ్డిక్షేత్రాలు, నీటి సౌకర్యం కల్పిస్తున్నాం. గతంతో పోలిస్తే వన్యప్రాణుల సంఖ్య పెరిగింది. వేట కూడా తగ్గింది. వన్యప్రాణుల చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తాం. వన్యప్రాణి వారోత్సవాల సందర్భంగా వివిధ కార్యక్రమాలు చేపడుతాం.

– శివ్ ఆశిష్‌సింగ్, జిల్లా అటవీ అధికారి

కఠిన చట్టాలు..

వన్యప్రాణులను వేటాడినా, వాహనంతో ఢీకొట్టి చంపిన కఠిన చట్టాలున్నాయి. 1972 యాక్ట్ ప్రకారం 6 నెలల నుంచి 8 ఏళ్ల వరకు జైలు శిక్ష తోపాటు రూ.3 వేల నుంచి రూ.10 వేల వరకు జరిమానా ఉంది. షెడ్యూల్ 1 కిందికి వచ్చేపులి, చిరుత, ఎలుగుబంటి, లాంటి అంతరిస్తున్న జంతువులను వేటాడితే 8 ఏళ్ల జైలు శిక్ష ఉంటుంది. షెడ్యూల్ 2 కిందికి వచ్చే మిగతా జంతువుల వేటాడి చంపితే 6 నెలల నుంచి 7 ఏళ్ల వరకు జైలు శిక్ష ఉంటుందని అధికారులు పేర్కొన్నారు.

మొదలైన వారోత్సవాలు

ఈ నెల 2 నుంచి 7 వరకు 70వ వన్యప్రాణి వారోత్సవాలను డీఎఫ్‌వో శివ్ ఆశిష్‌సింగ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. అవగాహన ర్యాలీ, ఫుట్ పెట్రోలింగ్, విద్యార్థులకు చిత్రలేఖనం, ఉపన్యాస పోటీలు, ప్రజాప్రతినిధులు, ప్రజలకు అవగాహన కార్యక్రమం, బైక్‌ర్యాలీ నిర్వహించనున్నారు.

గంజాయి విక్రేతల అరెస్టు



పట్టుబడ్డ నిందితులతో ఎస్సై సుగుణాకర్

నస్పూర్: పట్టణ పరిధిలో గంజాయి విక్రయిస్తున్న వ్యక్తులను సీసీసీ నస్పూర్ పోలీసులు గురువారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఎస్సై నెల్కి సుగుణాకర్ తెలిపిన వివరాల ప్రకారం.. తీగల్‌పహాడ్‌లోని క్రషర్ మిల్ సమీపంలో ఏడుగురు వ్యక్తులు గంజాయికి అలవాటుపడి భద్రాచలం నుంచి తక్కువ ధరకు కొనుగోలు చేసి అందరూ పంచుకోవడానికి ప్రయత్నించారు. సమాచారం అందుకున్న పోలీసులు దాడి చేసి ముగ్గురు నిందితులను పట్టుకోగా.. మరో నలుగురు పారిపోయారు. పట్టుబడ్డ గోదారి రాజు, జాడి వంశి, సాయికుమార్ నుంచి 1.5 కిలోల గంజాయి, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

గని మేనేజర్‌పై కేసు నమోదు

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ ఏరియాలోని ఆర్కే 5 గని మేనేజర్ అబ్దుల్‌ఖదీర్‌పై శ్రీరాంపూర్ పోలీస్‌స్టేషన్‌లో గురువారం కేసు నమోదైంది. ఎస్సై సంతోష్ తెలిపిన వివరాల ప్రకారం.. గనిలో పని చేస్తున్న జనరల్ మజ్దూర్ కార్మికుడు దేవి శ్రీనాథ్ కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఈ క్రమంలో గని మేనేజర్ వద్దకు వెళ్లి తనకు ఫ్యాన్ ఆపరేటర్ పని ఇవ్వాలని కోరగా అందుకు ఆయన నిరాకరించడంతోపాటు కులం పేరుతో దూషించడానికి ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

క్లుప్తంగా

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

ఆదిలాబాద్‌రూరల్: మావల పోలీస్ స్టేషన్ పరిధిలోని చిల్కూరి లక్ష్మీ గార్డెన్ సమీపంలో గురువారం గుర్తు తెలియని మృతదేహం లభ్యమైనట్లు ఎస్సై విష్ణువర్ధన్ తెలిపారు. మృతునికి సుమారు 55 సంవత్సరాలు ఉంటాయని, కొన్నిరోజులుగా ఆయాప్రాంతాల్లో భిక్షాటన చేస్తున్నాడన్నారు. అనారోగ్యం బారిన పడి మృతి చెంది ఉంటాడన్నారు. మృతదేహాన్ని రిమ్స్ మార్చురీకి తరలించామని, సంబంధీకులు ఉంటే 87126 59925 నంబరులో సంప్రదించాలన్నారు.

మహిళను వేధించిన వ్యక్తికి రెండు నెలల జైలు

కడెం: మహిళను వేధించిన వ్యక్తికి రెండు నెలల జైలు శిక్ష, రూ.2 వేల జరిమానా విధిస్తూ ఖానాపూర్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ జితిన్‌కుమార్ గురువారం తీర్పునిచ్చారు. కడెం ఎస్సై కృష్ణసాగర్‌రెడ్డి, కోర్టు డ్యూటీ ఆఫీసర్ నర్సింహ కథనం ప్రకారం.. మండలంలోని లింగాపూర్ గ్రామానికి చెందిన తక్కళ్లపెల్లి గణేశ్ తనను వేధిస్తున్నాడని అదే గ్రామానికి చెందిన ఓ మహిళ 2015లో స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈమేరకు కేసు నమోదుచేసిన పోలీసులు విచరణ జరిపి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. ఖానాపూర్ కోర్టులో ఏపీపీ దేవేందర్ సాక్షులను హాజపర్చగా నేరం రుజువు కావడంతో మేజిస్ట్రేట్ జైలు శిక్ష, జరిమానా విధించారు.

మట్టి తరలిస్తున్న ఇద్దరిపై కేసు

భీమారం: మండల కేంద్రంలోని రైతువేదిక సమీపంలో ప్రభుత్వ భూముల నుంచి మట్టి తరలించిన మెండె పున్నం(జేసీబీ యజమాని), బొల్లం శ్రీనివాస్(ట్రాక్టర్ల యజమాని)లపై గురువారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాములు తెలిపారు. రెండు ట్రాక్టర్లు స్వాధీనం చేసుకున్నామని, జేసీబీ కోసం గాలిస్తున్నామని పేర్కొన్నారు. కొంతకాలంగా ప్రభుత్వ భూ ముల నుంచి అనుమతి లేకుండా మట్టి తరలిస్తున్నారని తహసీల్దార్ సదానందం ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. మైనింగ్ శాఖ అనుమతితోనే మట్టి తరలించాలని, లేనిపక్షంలో చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

75 కిలోమీటర్లు కాలినడకన...



మహోర్ నుంచి వస్తున్న గిరిజనులు

తాంసి(బోథ్): ఆదిలాబాద్ జిల్లా భీంపూర్ మండలంలోని శాంతినగర్ వాసులు మూడేళ్లుగా తమ గ్రామంలో నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శారదాదేవి విగ్రహాన్ని ప్రతిష్ఠిస్తున్నారు. ఇందులో భాగంగా మండపంలో వెలిగించే అఖండజ్యోతి కోసం 75 కిలోమీటర్ల దూరంలో ఉన్న మహారాష్ట్రలోని మహోర్ దేవస్థానం నుంచి కాకడ హారతి తీసుకొచ్చారు. గురువారం వేకువజామున మహోర్ రేణుకామాత దర్శనం చేసుకుని కాకడ హారతి చేతపట్టుకుని కాలినడకన రాత్రి గ్రామానికి చేరుకున్నారు. కొలాం గిరిజనులు ఆచారం ప్రకారం పూజలు నిర్వహించి అఖండ జ్యోతి వెలిగించారు. గ్రామస్తులపై రేణుకామాత అనుగ్రహం ఉండాలని, పాడిపంటలు సమృద్ధిగా పండాలని మొదటిసారిగా కాలినడకన వెళ్లి కాకడ హారతి తీసుకొచ్చినట్లు గ్రామ పెద్ద దిలీప్ తెలిపారు.

ఆగని భూ ఆక్రమణలు..!

- ఆక్రమిత ప్రభుత్వ భూముల్లో బోర్డుల ఏర్పాటు
- బేఖాతర్ చేస్తున్న అక్రమార్కులు



కాల్‌టెక్స్‌లోని ప్రభుత్వ భూమిలో పాతిన బోర్డు

బెల్లంపల్లి: రెవెన్యూ డివిజన్ కేంద్రం బెల్లంపల్లిలో ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురవుతూనే ఉన్నాయి. రెవెన్యూ అధికారులు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తున్నా అక్రమార్కులు బేఖాతర్ చేస్తున్నారు. గత శుక్రవారం కాల్‌టెక్స్ ఏరియా 12, 13వ మున్సిపల్ వార్డుల మధ్యలో కబ్జాకు యత్నించగా.. సర్వేనంబర్ 104లోని ప్రభుత్వ భూమిలో హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. ఆక్రమణదారులు చట్టరీత్యా శిక్షార్హులని పేర్కొన్నారు. అదేమీ లెక్క చేయకుండా హెచ్చరిక బోర్డును ఆనుకుని రాత్రికి రాత్రే షెడ్డు నిర్మించడం సంచలనం సృష్టించింది. ఆ స్థలం హైకోర్టు పరిధిలో ఉందని, అడ్డుకునే చర్యలకు పాల్పడితే కోర్టు ధిక్కరణకు గురవుతారని ప్రతి బోర్డును ఏర్పాటు చేయడం చర్చనీయాంశమైంది. అంబేద్కర్‌నగర్ ప్రభుత్వ భూమిలో నిర్మిస్తున్న ఓ శాశ్వత కట్టడాన్ని కూల్చివేశారు. ఇప్పటికే ఎంతో విలువైన ప్రభుత్వ భూములను కబ్జా చేశారు. మిగిలిన కొద్దిపాటి భూములపైనా కన్నేసి వదలకుండా ఆక్రమణకు తెగబడుతున్నారు. కాల్‌టెక్స్ ఏరియా, గంగారాం నగర్, కన్నాల, గాంధీనగర్ తదితర ప్రాంతాల్లో జాతీయ రహదారి పక్కన ఉన్న ప్రభుత్వ భూముల ఆక్రమణకు అక్రమార్కులు చేయని ప్రయత్నం లేదు. గతంలో కన్నాల శివారు జాతీయరహదారి పక్కన అప్పటి ఆర్డీవో ఆయేషా మస్రత్ ఖానమ్, బెల్లంపల్లి తహసీల్దార్ శ్యామలదేవి ప్రభుత్వ భూమిగా నిర్ధారించి జేసీబీ, ట్రాక్టర్లతో దగ్గరుండి కూల్చివేయించారు. హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసినా భూ కబ్జా ఆగకపోవడాన్ని పుర ప్రజలు గుర్తు చేసుకుంటున్నారు. సింగరేణి ఏరియా ఆసుపత్రి ముందు, అంబేద్కర్‌నగర్, రాంనగర్, అశోక్‌నగర్, బూడిదగడ్డ బస్తీ, షంషీర్ నగర్, మహ్మద్ ఖాశీంబస్తీ, బెల్లంపల్లి బస్తీ, కాంటా చౌరస్తా, కన్నాల బస్తీ, కొత్త బస్టాండ్ ఏరియా ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల పక్కన తదితర ప్రాంతాల్లో పాతిన హెచ్చరిక బోర్డులు పత్తా లేకుండా పోయాయి. భూ ఆక్రమణల వెనుక ప్రభుత్వ అధికారుల హస్తం ఉందనే విమర్శలు ఉన్నాయి. గతంలో ఇక్కడ పని చేసిన పలువురు లోపాయికారిగా వ్యవహరించారనే అపవాదు ఉంది. ప్రస్తుతం పని చేస్తున్న కొందరు అదే తీరుగా సహకారం అందిస్తున్నట్లు ఆరోపణలున్నాయి.

నిర్మల్‌లో నిషేధిత మత్తుపదార్థాల పట్టివేత

- పక్కా సమాచారంతో ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ దాడులు
- భారీగా క్లోరాల్ హైడ్రేట్, అల్ప్రాజోలం పట్టివేత
- వీటి విలువ రూ.43 లక్షలు ఉంటుందని అంచనా



క్లోరల్ హైడ్రేడ్ స్వాధీనం చేసుకున్న ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు

నిర్మల్ టౌన్: నిర్మల్ పట్టణంలో నిషేధిత మత్తు పదార్థాలను ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ అధికారులు గురువారం పట్టుకున్నారు. పక్కా సమాచారంతో ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ కమలాసన్‌రెడ్డి ఆదేశాల మేరకు హైదరాబాద్ సూపరింటెండెంట్ ప్రదీప్‌రావు ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. పట్టణంలోని ద్వారకానగర్‌కు చెందిన గంధం శ్రీనివాస్ గౌడ్ ఇంటిపై దాడులు చేశారు. 3.3 కిలోల అల్ప్రాజోలం స్వాధీనం చేసుకున్నారు. అతడిని వి చారణ చేయగా ఇచ్చిన సమాచారంతో శాంతినగర్‌కాలనీలోని ఓ ఇంట్లో బస్తాలలో నిల్వ ఉంచిన 728 కిలోల క్లోరాల్ హైడ్రేట్‌ను స్వాధీనం చేసుకున్నారు. మహారాష్ట్రలోని సోలాపూర్ శ్రీను అల్ప్రాజోలంను రాజస్థాన్‌లోని రూప్‌సింగ్ వద్ద కొనుగోలు చేసి దిగుమతి చేసుకున్నట్లు తెలిపారు. ఈ అల్ప్రాజోలం 10 గ్రాములతో 100 పెట్టెల కల్తీ కల్లు తయారు చేయవచ్చని తెలిపారు. కిలో అల్ప్రాజోలం విలువ సుమా రు రూ.10 లక్షలకుపైగా ఉంటుందని తెలిపారు. సూపరింటెండెంట్ ప్రదీప్‌రావు మాట్లాడుతూ.. స్వాధీనం చేసుకున్న మత్తు పదార్థాల విలువ రూ.43 లక్షలు ఉంటుందని వెల్ల డించారు. ఈమేర కు శ్రీనివాస్‌గౌడ్‌పై కేసు నమోదు చేసినట్లు తెలి పారు. గతంలో శ్రీనివాస్‌గౌడ్‌పై ఏడు కేసులు ఉన్నాయని, పీడీయాక్టు కూడా నమోదైందని వెల్లడించారు. దాడుల్లో స్టేట్ ఎక్సైజ్ ఎస్సై బాలరాజు, సీఐ లక్ష్మణ్‌రావు, ఎస్సై వసంతరావు, అభిషేక్ పాల్గొన్నారు.

మద్యానికి బానిసై వ్యక్తి ఆత్మహత్య

సోన్:మండలంలోని న్యూబొప్పారం గ్రామానికి చెందిన శివరాత్రి రవి(33) గురువారం ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. రవి కూలీ పని చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. గురువారం ఉదయం మద్యం తాగి ఇంటికి వచ్చాడు. ఇంటివెనుకాల ఉన్న రేకుల షెడ్డులోకి వెళ్లి చీరతో ఉరేసుకున్నాడు. కుటుంబ సభ్యులు మధ్యాహ్నం వెళ్లి చూడగా చనిపోయి ఉన్నాడు పోలీసులకు సమచారం అందించగా ఘటన స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. రవికి భార్య, కూతురు, ఏడాది వయసున్న కొడుకు ఉన్నాడు. రవి తండ్రి పోశెట్టి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో తాహెర్‌ఖాన్ తెలిపారు.

లింబా(కే)లో..



రమేశ్(ఫైల్)

కుంటాల: మండలంలోని లింబా(కె) గ్రామానికి చెందిన బొరిగాం రమేశ్(42) ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై భాస్కరాచారి తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం.. రమేశ్ మద్యానికి బానిసై ఇంటి పక్కన ఉన్న రేకుల షెడ్డులో దూలానికి ఉరివేసుకున్నాడు. రమేశ్ భార్య సంతోషి ఫిర్యాదు మేరకు పంచానామా చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఉమ్మడి జిల్లా రిజిస్ట్రార్‌గా రవీందర్‌రావు



కైలాస్‌నగర్: రిజిస్ట్రేషన్లు, స్టాంపుల శాఖ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా రిజిస్ట్రార్‌గా ఎం.రవీందర్‌రావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇది వరకు రిజి స్ట్రార్‌గా పనిచేసిన అశోక్ కుమార్‌ను మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లాకు బదిలీ చేసిన ప్రభుత్వం ఆ స్థానంలో హైదరాబాద్ దక్షిణ డీఆర్‌గా ఉన్న రవీందర్‌రావును నియమించింది. కార్యాలయ అధికారులు, ఉద్యోగులు ఆయనకు పుష్పగుచ్ఛాలు అందించి ఘనస్వాగతం పలికారు.

జాతీయస్థాయికి ఎంపిక

ఆసిఫాబాద్‌రూరల్: ఉమ్మడి జిల్లా నుంచి నలుగురు విద్యార్థులు జాతీయస్థాయి సబ్ జూనియర్ హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపికయ్యారని హ్యాండ్‌బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు శ్యాంసుందర్‌రావు గురువారం తెలిపారు. సెప్టెంబర్ 15 నుంచి 17 వరకు నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో చెన్నూర్ మండలానికి చెందిన రఘు, కౌటాల మండలానికి చెందిన యోగి, కార్తీక్, ఆసిఫాబాద్ మండలానికి చెందిన సాయి ఉత్తమ ప్రతిభ చూపి జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారని తెలిపారు. ఈ నెల 3 నుంచి 7 వరకు హైదరాబాద్‌లో నిర్వహించే జాతీయస్థాయి పోటీల్లో వీరు పాల్గొంటారని వెల్లడించారు.

మహిళపై దాడి

తిర్యాణి(ఆసిఫాబాద్): హత్య చేయాలనే ఉద్దేశంతో ఓ వ్యక్తి మహిళపై దాడి చేసి గాయపర్చాడు. ఎస్సై మాధవ్‌గౌడ్, బాధితురాలు తెలిపిన వివరాల ప్రకారం.. తిర్యాణి మండలం సుంగాపూర్ పరిధిలోని దానపూర్‌కు చెందిన టేకం మారుబాయి గ్రామ శివారులో కంది, పెసర్లు సాగు చేస్తోంది. భర్త మారుతో కలిసి చేను వద్దే గుడిసె ఏర్పాటు చేసుకుని ఉంటుంది. గురువారం ఉదయం చేను వద్ద ఉన్న మారుబాయిపై అదే గ్రామానికి చెందిన ఆత్రం రాజు కొడవలితో దాడి చేసేందుకు ప్రయత్నించి విఫలమయ్యాడు. వెంటనే తన వద్ద ఉన్న బాడిషా(గొడ్డలి వంటి పదునైన ఆయుధం)తో తలపై దాడి చేశాడు. గాయపడిన మారుబాయి అపస్మారక స్థితికి చేరుకుంది. అనంతరం రాజు ఘటనాస్థలి నుంచి పారిపోయాడు. అక్కడికి చేరుకున్న ఆమె భర్త.. మారుబాయిని స్థానికుల సాయంతో మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లాడు. మెరుగైన వైద్యం కోసం మంచిర్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. దాడికి పాల్పడిన రాజు ఆచూకీ ఇప్పటివరకు దొరకలేదు. కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి

భైంసారూరల్: మండలంలోని సుంక్లి గ్రామ శివారులో జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన సిరిపూర్ నితీశ్‌కుమార్(22) చికిత్సపొందుతూ మృతి చెందినట్లు ఎస్సై శ్రీనివాస్ తెలిపారు. బీహార్‌కు చెందిన నితీశ్‌కుమార్ తన తమ్ముడు కరణ్‌కుమార్ కొంత కాలంలో సుంక్లి సమీపంలోని సిరిమల్లె మహేశ్ రైస్‌మిల్లులో కార్మికులుగా పనిచేస్తున్నారు. బుధవారం రాత్రి వంట సామగ్రి కోసం ద్విచక్రవాహనంపై వానల్‌పాడ్ గ్రామానికి వెళ్తుండగా మూలమలుపు వద్ద అదుపుతప్పి కిందపడ్డారు. వాహనం నడుపుతున్న నితీశ్‌కుమార్‌కు తీవ్రగాయాలు కాగా, వెనకాల కూర్చున్న కరణ్‌కుమార్ స్వల్పగాయాలయ్యాయి. స్థానికులు క్షతగాత్రున్ని 108 అంబులెన్సులో భైంసా ఏరియా ఆసుపత్రికి తరలించారు. వైద్యులు సూచన మేరకు నిర్మల్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు. కరణ్‌కుమార్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు.

మోటార్‌సైకిల్ అదుపుతప్పి ఒకరు..



సైదుల సాగర్(ఫైల్)

కోటపల్లి: మండల కేంద్రానికి చెందిన సైదుల సాగర్ (28) ద్విచక్రవాహనం అదుపుతప్పి కిందపడి మృతిచెందాడు. ఎస్సై రాజేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. సాగర్ గురువారం ఉదయం షట్‌పల్లి గ్రామానికి వెళ్లాడు. తిరిగి వస్తుండగా షట్‌పల్లి గ్రామ సమీపంలో వాహనం అదుపు తప్పి కిందపడ్డాడు. తీవ్ర గాయాలైన అతడిని స్థానికులు 108 అంబులెన్స్‌లో మంచిర్యాల ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గంమధ్యలోనే చనిపోయాడు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై రాజేందర్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు..

మందమర్రిరూరల్: మందమర్రి పోలీస్‌స్టేషన్ పరిధిలోని యాపల్ సమీపంలో జాతీయ రహదారి సర్వీస్ రోడ్డుపై బుధవారం రాత్రి జరిగిన ప్రమాదంలో రాంటెంకి రాజేష్(20) మృతిచెందాడు. ఎస్సై రాజశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం.. భీమారం మండలం ఆరేపల్లి గ్రామానికి చెందిన రాజేష్ తన స్నేహితుడు నాగరాజుతో కలిసి తాండూర్ మండలం బోయపల్లికి వెళ్లి తిరిగి వస్తున్నారు. స్థానిక అంగడి బజార్ సర్వీస్ రోడ్డు వద్ద వెనుక నుంచి ఆటో ఢీకొట్టింది. దీంతో బైక్ వెనుకాల కూర్చున్న రాజేష్‌కు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే 108 ద్వారా బెల్లంపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి, అక్కడి నుంచి మంచిర్యాల ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. రాజేష్ తండ్రి పోషం ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మహిళ మెడలో నుంచి గొలుసు చోరీ

జన్నారం: మోటార్‌సైకిల్‌పై వచ్చిన దుండుగుడు ఓ మహిళ మెడలో నుంచి రెండు తులాల బంగారు గొలుసు లాక్కెళ్లిన సంఘటన గురువారం జన్నారం పోలీసుస్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. ఉట్నూర్ మండలం దంతెనపల్లికి చెందిన చింతకింది రమ గురువారం జన్నారం మండలం దేవునిగూడలోని తన తల్లి ఇంటికి భర్తతో కలిసి వచ్చింది. పక్కింటి వారితో మాట్లాడుతుండగా మోటార్‌సైకిల్‌పై వచ్చిన గుర్తు తెలియని వ్యక్తి ఆమె మెడలో నుంచి పుస్తెల తాడును లాక్కెళ్లాడు. గమనించిన భర్త, చుట్టుపక్కల వారు వెంబడించినా తప్పించుకుని పారిపోయాడు. ఎస్సై రాజవర్ధన్ ఆధ్వర్యంలో రెండు బృందాలు నిందితుడి కోసం గాలిస్తున్నారు. సీసీ కెమెరాల ద్వారా నిందితుడి ఆచూకీ కోసం ప్రయత్నిస్తున్నారు. నిందితుడు దస్తురాబాద్ మండలం వైపు పారిపోయినట్లు ఎస్సై పేర్కొన్నారు.

పేరుకే 24గంటలు.. గర్భిణికి అందని వైద్యం



అంబులెన్స్‌లో వైద్యం చేస్తున్న అంబులెన్స్ సిబ్బంది

వేమనపల్లి: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్యంలో 24గంటలూ వైద్యం అందించాల్సి ఉన్నా గర్భిణికి వైద్యం అందకుండా పోయింది. సిబ్బంది ఎవరూ లేకపోవడంతో అంబులెన్స్‌లో 30కిలోమీటర్ల దూరంలోని చెన్నూర్ సివిల్ ఆస్పత్రికి తరలించాల్సి వచ్చింది. మండలంలోని గోర్లపల్లి కొత్తకాలనీకి చెందిన బోరుకూటి స్వరూప ఆరు నెలల గర్భంతో ఉంది. మండలంలోని జాజులపేటలో ఉన్న తల్లిగారింటికి వెళ్లింది. గురువారం సాయంత్రం 5గంటలకు ఆమె కడుపునొప్పితో బాధపడుతూ స్థానిక పీహెచ్‌సీకి వచ్చింది. ఆయమ్మ నిర్మల బీపీ పరీక్షించగా... కాంటింజెంట్ వర్కర్ బాపు వైద్యాధికారి రాజేష్‌కు సమాచారం అందించాడు. ఆయన సూచన మేరకు ఓ గోళి ఇచ్చారు. బుధవారం రోజునే ముగ్గురు స్టాఫ్‌నర్సులు విధుల్లో చేరారు. ఆస్పత్రిలో ఎవరూ లేకపోవడంతో రెండు గంటలు వేచి చూసిన గర్భిణిని కుటుంబ సభ్యులు చెన్నూర్ సివిల్ ఆస్పత్రికి తరలించారు.

సాగులో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి



రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

బెల్లంపల్లిరూరల్: రైతులు పంటల సాగులో సస్యరక్షణ చర్యలు చేపట్టడంతో అనేక లాభాలు గడించవచ్చని బెల్లంపల్లి కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ కోట శివకృష్ణ, పొలాస(జగిత్యాల) వ్యవసాయ కళాశాల విద్యార్థులు అన్నారు. గురువారం బెల్లంపల్లి మండలం ఆకెనపల్లి గ్రామంలో గ్రామీణ భాగస్వామ్య విశ్లేషణాత్మక సదస్సు నిర్వహించారు. కళాశాలలో బీఎస్సీ అగ్రికల్చర్ నాలుగో సంవత్సరం విద్యార్థులు భూభాగ పటం, సామాజిక వనరుల పటం, నేల రకాలుతోపాటు ఇతర అంశాలపై నేలపై చిత్రాలు గీసి రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కళాశాల విద్యార్థులు తిరుపతి, శ్రీధర్, నరేష్, మణిదీప్, నవతేజ్, పవన్, మండల వ్యవసాయ శాఖ అధికారి ప్రేమ్‌కుమార్, కేవీకే శాస్త్రవేత్త తిరుపతి, ఏఈవోలు తిరుపతి, శంకర్, రాంచందర్ పాల్గొన్నారు.

మేళాకు తరలిన మహిళా సంఘాల సభ్యులు



హాజరైన సభ్యులు, అధికారులు

పాతమంచిర్యాల: హైదరాబాద్‌లోని పీపుల్స్ ప్లాజాలో సరస్ మేళా(సేల్ ఆఫ్ ఆర్టికల్స్ ఆఫ్ రూరల్ ఆర్టిజన్స్ సొసైటీ)కు మంచిర్యాల నుంచి స్వయం సహాయక సంఘాల సభ్యులు 90 మంది గురువారం తరలి వెళ్లారు. దేశంలోని పలు ప్రాంతాలకు చెందిన కళాకారులు, వృత్తి పని వారు తయారు చేసిన 200 రకాల కళాఖండాలు, వస్తువుల గురించి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు రాజేశ్వరీ, అడిషనల్ డీఆర్‌డీవో వెంకటేశ్వర్లు, డీపీఎంలు వేణు, స్వర్ణలత తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు ముందుకు రావాలి

కాసిపేట: వన్యప్రాణులు, పర్యావరణ పరిరక్షణకు యువత ముందుకు రావాలని అటవీ శాఖ డిప్యూటీ రేంజ్ అధికారి ప్రవీణ్‌నాయక్ సూచించారు. అటవీశాఖ ఆధ్వర్యంలో గురువారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో వన్యప్రాణుల వారోత్సవాల సందర్భంగా వ్యాసరచన పోటీలు నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ శంకర్, ఎఫ్‌బీఓ శ్రీధర్, లెక్చరర్లు సురేష్, వెంకటస్వామి, అంజనిప్రసాద్, రమేష్, చిరంజీవి, చంద్రశేఖర్, భాగ్యలక్ష్మి, విద్యార్థులు పాల్గొన్నారు.